సాక్షి
మంచిర్యాల

శనివారం । 19 । ఏప్రిల్ । 2025



'పచ్చడి' మెతుకులు కరువేనా!

జిల్లాలో పచ్చడి మామిడి కాయల కాత నిరాశజనకంగా ఉంది. తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గింది. ఫలితంగా మామిడి కాయల ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉంది. IIలో▸



యథేచ్ఛగా వన్యప్రాణుల వేట

బూర్గుపల్లి సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. ఉచ్చు బిగించి హతమార్చి కుప్పలు వేస్తూ.. మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
39.0 /28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వేడిగాలులు బలంగా వీస్తాయి. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'మావోయిస్టుల సిద్ధాంతాలకు కాలం చెల్లింది'



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

చెన్నూర్: మావోయిస్టుల సిద్ధాంతాలకు కాలం చెల్లిందని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి, భీమారం నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు, పోస్టర్లు వెలిశాయని, దీనిపై విచారణ చేస్తున్నామని తెలిపారు. మావోయిస్టుల సంచారం ఉన్న సమయంలో మారుమూల గ్రామాలు వెనుకబాటుకు గురయ్యాయని తెలిపారు. గత పదేళ్లుగా జిల్లాలో మావోయిస్టులు ఉనికి లేకపోవడంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మావోయిస్టుల దుశ్చర్యలను గమనించిన కొందరు చైతన్యవంతులైన ఆదివాసీ యువకులు మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు, కరపత్రాలు వేశారని తెలుస్తోందని అన్నారు. సమావేశంలో చెన్నూర్, చెన్నూర్ రూరల్ సీఐలు దేవేందర్‌రావు, సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మావోయిస్టు వ్యతిరేక వాల్‌పోస్టర్లు



ఆలుగామ పాఠశాల గోడకు కరపత్రం

వేమనపల్లి/కోటపల్లి: ఆదివాసీ యువజన సంఘం పేరిట వేమనపల్లి మండలం ముక్కిడిగూడెం, కళ్లంపల్లి, సుంపుటం, జాజులపేట, కోటపల్లి మండలం వెంచపల్లి, ఆలుగామ, రొయ్యలపల్లి, సిర్సా, లింగన్నపేట, పంగిడిసోమారం, నక్కలపల్లి గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా శుక్రవారం వాల్‌పోస్టర్లు, కరపత్రాలు వెలిశాయి. బాంబులు పెట్టామంటూ మావోయిస్టులు ఆదివాసీలను బెదిరించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. కాలం చెల్లించిన సిద్ధాంతాలకు స్వస్తి పలకాలని కోరారు. కర్రెగుడ పేలుడు ఘటనను ప్రస్తావిస్తూ వాల్‌పోస్టర్లను ముద్రించారు. వాల్‌పోస్టర్లు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. పోలీసు శాఖ అప్రమత్తమై వాల్‌పోస్టర్లపై ఆరా తీయడంతోపాటు ఆయా ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశారు.

మే 20న దేశవ్యాప్త సమ్మె



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

మంచిర్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో శుక్రవారం కార్మిక సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27న కార్మిక సంఘాల సదస్సును మార్క్స్ భవన్‌లో నిర్వహిస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్, టీయూసీఐ జాడి దేవరాజు, టీఎస్టీయూసీ మణిరామ్‌సింగ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి పౌలు, ఖలీందర్ అలీఖాన్, సీఐటీయూ రాజేశ్వరి, ఐఎఫ్‌టీయూ నాయకులు మేకల రాములు, చిన్నయ్య, రాజేశం, సురేందర్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ పట్టాభిషేకం



సన్నివేశంలో పాత్రధారులు

కోటపల్లి: మండలంలోని బ్రహ్మణపల్లిలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న చిరుతల రామయణం శుక్రవారంతో ముగిసింది. రామలక్ష్మణులు లంకపై దాడి చేసి రావణసురుడిని హతమార్చి లంకలో ఉన్న సీతను తీసుకువచ్చిన సన్నివేశాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం పట్టాభిషేకం ఘట్టంతో ముగిసింది. చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

కాసులే కావాలి!



- డబ్బుల కోసం ఎంతకైనా తెగిస్తున్న వైనం
- జిల్లాలో దారి తప్పుతున్న కొందరు ఖాకీలు
- నస్పూర్ ఎస్సై తీరుపై సర్వత్రా విమర్శలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పోలీసు శాఖలో కొందరు అధికారుల తీరు వివాదాస్పదంగా మారుతోంది. నస్పూర్ పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో సుగుణాకర్ క్షుద్రపూజల కేసులో జప్తు చేసిన రూ.2లక్షలు బాధితుడికి ఇచ్చేందుకు ఇబ్బందులకు గురి చేసిన వైనం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. డబ్బులు ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా ఫొటో దిగి బాధితుడినే బెదిరిస్తూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆ ఎస్సై ప్రవర్తించిన తీరు ఆ శాఖకే మచ్చ తెస్తోంది. చివరికి బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. జిల్లాలో నిక్కచ్చిగా, నిజాయతీగా పని చేస్తున్న అధికారులూ ఉన్నారు. ఆ నిజాయతీ అధికారులకు కీలక స్థానాల్లో పోస్టింగ్ దొరకడం లేదు. ఆదాయం వచ్చే స్టేషన్లుగా చెప్పుకునే చోట్ల కొందరు తిష్ట వేస్తూ రాజకీయ అండదండలతో చెలరేగుతున్నారు.

ఆగని వసూళ్ల పర్వం

ప్రతీ కేసులో ఎంతో కొంత స్టేషన్ ఖర్చుల పేరుతో వసూళ్లు చాలా చోట్ల పరిపాటిగా మారింది. ఇదంతా నిత్యం బహిరంగంగానే సాగుతున్నా ఎవరూ చెప్పక వెలుగులోకి రావడం లేదు. సివిల్ పంచాయితీలు, కుటుంబ తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, చీటింగ్, ఇతర క్రిమినల్ కేసుల్లో నిందితుల శిక్ష తగ్గింపు, సీజ్ చేసిన వాహనం, నగదు, ఆస్తుల విడుదలలోనూ చేతివాటం చూపిస్తున్నారు. ఇక దొంగతనాల కేసుల్లో కోల్పోయిన, రికవరీ సొమ్ములోనూ తేడా చూపిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. గతంలో జిల్లా కేంద్రంలో పని చేసిన ఓ ఎస్‌హెచ్‌వో అవయవదానం కేసులో రూ.లక్షలు వసూలు చేసిన ఘటన నేటికీ అధికారుల్లో చర్చకు వస్తుంది. స్టేషన్ బెయిల్ కోసం గతంలో బెల్లంపల్లి టూటౌన్ పరిధిలో ఓ పోలీసు అధికారి ఏసీబీకి చిక్కారు. గతంలో జిల్లా కేంద్రంలో పని చేసిన ఓ ఎస్సై బార్ల వద్ద నెలనెలా మామూళ్లు వసూలు చేస్తూ, తిరిగి బార్ యజమాని వద్దకు వెళ్లి బెదిరించడం అప్పట్లో వివాదాస్పదమైంది.

అండ ఉంటే చాలన్నట్లుగా..

చాలామంది పోలీసు అధికారులు స్థానిక రాజకీయ అండ ఉంటే చాలన్నట్లుగా వ్యవహరిస్తూ వివాదాస్పదం అవుతున్నారు. పోస్టింగ్ నుంచి రోజువారీ డ్యూటీ దాకా క్రమశిక్షణ గీత దాటినా, ఏం చేసినా తమను చూసుకుంటారనే ధీమాలో ఉంటున్నారు. కొన్ని చోట్ల వ్యాపారులు, బడా వ్యక్తులు, ఆర్థికంగా 'అవసరమైన' వారితో దోస్తీ చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రతీ కేసులో రాజకీయ కోణం ఎంత? ఫిర్యాదు, నిందితుల బ్యాక్‌గ్రౌండ్ పరిశీలిస్తూ ఒక్కో కేసులో ఒక్కో తీరుగా వ్యవహరిస్తున్నారు. అంతా మట్లాడాకే ఎఫ్ఐఆర్ చేస్తున్నారు. కొన్ని కేసులను నీరుగారుస్తూ పక్కదారి పట్టిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఇందుకు నమ్మకస్తులైన సీనియర్, స్థానిక కింది స్థాయి సిబ్బందిని ఉన్నతాధికారులకు మధ్య వారధిగా వాడుకుంటున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఇద్దరు పోలీసు అధికారులపై రాష్ట్రస్థాయిలో ఫిర్యాదులు వెళ్లాయి. ఎంతో కష్టపడి కొలువు సాధించి, సమాజంలో సేవ చేసే అవకాశం దొరికితే అత్యాశకు పోయి చివరకు ఉద్యోగానికే ఎసరు తెచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. ఉన్నతాధికారులు తమ కింది అధికారులు పక్కదారి పట్టకుండా నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంది.

ఏసీబీ వలలో నస్పూర్ ఎస్సై

- క్షుద్రపూజల కేసులో నగదు జప్తు
- బాధితుడికి ఇవ్వకుండా ఇబ్బందులు



ఎస్సై సుగుణాకర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/నస్పూర్: క్షుద్రపూజల కేసులో జప్తు చేసిన నగదును బాధితుడికి ఇవ్వక సొంతానికి వాడుకున్న ఎస్సై అవినీతి నిరోధక శాఖకు చిక్కి జైలు పాలయ్యాడు. ఆదిలాబాద్ రేంజీ డీఎస్పీ పి.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్ గత జనవరి 26న క్షుద్రపూజలతో రెట్టింపు డబ్బులు చేస్తానని మహారాష్ట్రకు చెందిన ఓ పూజరి మోసం కేసులో రూ.2లక్షలు జప్తు చేశాడు. కేసు ఫిర్యాదుదారుడు ప్రభంజన్ కోర్టు నుంచి నగదు విడుదల కోసం ఈ నెల 4న ఉత్తర్వులు తీసుకు రాగా, ఇచ్చేందుకు ఎస్సై దాట వేశాడు. రూ.1.50లక్షలు బాధితుడి చేతిలో పెడుతూ ఫొటో దిగి, వెంటనే డ్రాలో వేసుకున్నాడు. రూ.2లక్షలు తీసుకున్నట్లు సంతకం చేయమని ఒత్తిడి చేయగా బాధితుడు ఒప్పుకోలేదు. ఈ నెల 8న మళ్లీ స్టేషన్‌కు వెళ్లి ఎస్సైని అడిగితే, డబ్బులు ఖర్చయ్యాయని, రూ.50వేలు ఉన్నాయని, నీ మీద కూడా కేసు అయ్యేది ఇచ్చింది తీసుకో అంటూ బెదిరించి పంపేశాడు. ఈ నెల 10న రూ.70వేలు ఇచ్చేందుకు ఒప్పుకున్నాక ఇవ్వలేదు. చివరకు రూ.50వేలకు మరో పది వేలు కలిపి ఓ వైన్స్ వద్ద తీసుకోవాలని చెప్పాడు. ఇదే కేసులో బాధితుడి పేరు లేకుండా ఉండేందుకు ఎస్సై బినామీ డి.దీపక్‌కు ఫోన్ పేలో రూ.30వేలు చెల్లించాడు. విసిగెత్తిన బాధితుడు ఏసీబీ టోల్ ఫ్రీ 1064ను సంప్రదించగా, ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి ఎస్సై ఫోన్‌లో మాట్లాడిన ఆడియో రికార్డులు, ఫోన్ పే చెల్లింపు, జప్తు చేసిన నగదు లేకపోవడం ఆధారాలు సేకరించారు. ఎఫ్ఐఆర్ చేసి ఎస్సైని కరీంనగర్ ఏసీబీ కోర్టు ముందు ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు. 2020బ్యాచ్‌కు చెందిన ఎస్సై గతేడు జూలై నుంచి నస్పూర్ ఎస్సైగా పని చేస్తున్నారు.

కరుణామయుడి శిలువయాత్ర



సందేశం ఇస్తున్న ఫాదర్, పాల్గొన్న క్రైస్తవులు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని సేక్రడ్ హర్ట్ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరుణామయుడు పాపుల కోసం శిలువ ఎక్కిన దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే జరుపుకున్నారు. చర్చి ప్రాంగణం నుంచి బెల్లంపల్లి చౌరస్తా మీదుగా లక్ష్మీటాకీస్ థియేటర్ వరకు శిలువ క్రీస్తు వేషధారి, క్రైస్తవులు శిలువలు పట్టుకుని భక్తిభావంతో ర్యాలీ చేపట్టారు. తర్వాత బొక్కలగుట్ట గ్రామంలో కొండపై శిలువ ఆరాధనకు తరలివెళ్లారు. తిరిగివచ్చి ప్రార్థన మందిరంలో ఆరాధన కార్యక్రమం చేపట్టారు. అనంతరం చర్చి పాదర్‌లు జోష్ మాణికేతన్, ఫాదర్ జెన్సన్ సందేశం ఇచ్చారు. గాయక బృందం చర్చిలో ప్రత్యేక ఆరాధన గీతాలు ఆలపించారు.

మామిడి పండ్లు @100



బెల్లంపల్లి: మార్కెట్‌లోకి మామిడిపండ్లు వచ్చేశాయి. జిల్లాలో సాగు చేస్తున్న మామిడి చెట్ల నుంచి కాయలు సేకరించడం ప్రారంభం కాకపోగా వ్యాపారులు అమ్మకాల కోసం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నారు. బెల్లంపల్లిలో పసుపు వర్ణం పులుము కున్న మామిడి పండ్లను అమ్మకానికి పెట్టారు. కర్ణాటక రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకున్న బంగినేపల్లి మామిడి పండ్లను కిలో రూ.100 చొప్పున అమ్ముతున్నారు. ధర కాస్త ఎక్కువైనా పురప్రజలు వీటిని కొనుగోలు చేసి తీసుకు వెళ్తున్నారు.

మాలగురిజాలలో వైద్య శిబిరం

- కిడ్నీ వ్యాధిగ్రస్తుల వ్యథను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'
- వ్యాధిగ్రస్తుల వివరాలు ఆరా తీసిన వైద్యులు
- ప్రజలకు పరీక్షలు, మాత్రలు పంపిణీ
- మూత్ర, రక్త నమూనాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..



చేతిపంపును పరిశీలిస్తున్న వైద్యుల బృందం

బెల్లంపల్లి: మండలంలోని మాలగురిజాల గ్రామంలో పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతుండగా.. శుక్రవారం ప్రభుత్వ వైద్యులు సందర్శించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 'మాలగురిజాలకు కిడ్నీ గండం' శీర్షికన ఈ నెల 3న 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కిడ్నీల్లో రాళ్ల ఏర్పడడం, కిడ్నీలు చెడిపోయి డయాలసిస్‌కు చేరి మృతిచెందడం, కొందరు మంచం పట్టిన వైనాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. స్పందించిన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ బెల్లంపల్లి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సుధాకర్‌నాయక్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బందిని గ్రామానికి పంపించారు. వైద్య శిబిరం నిర్వహించి 52మందికి పరీక్షలు చేయగా.. వీరిలో 10మంది కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఆందోళనకు గురి కావద్దని డాక్టర్ సుధాకర్‌నాయక్ అన్నారు. గ్రామంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి, ఎంతకాలం నుంచి జబ్బుతో బాధపడుతున్నారని తెలుసుకున్నారు. గ్రామస్తులు రోజువారీగా నీటిని తాగుతున్న రెండు చేతిపంపుల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆయా చేతిపంపుల నీటిని పరీక్షల నిమిత్తం వరంగల్‌లోని లాబోరేటరీకి పంపిస్తామని ప్రకటించారు. వైద్య, ఆరోగ్య శాఖ తరపున గ్రామంలో మూడు రోజులపాటు వైద్య శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. నాలుగు బృందాలతో గ్రామంలోని 250 ఇళ్లు, 912 మంది జనాభాకు వైద్యపరీక్షలు చేయనున్నారు. ప్రతీ ఒక్కరి రక్త, మూత్ర నమూనాలను సేకరించి టీహబ్‌లో పరీక్షించనున్నారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఎవంజలెన, జిల్లా మాస్‌మీడియా అధికారి బి.వెంకటేశ్వర్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్, సూపర్‌వైజర్ మల్లిక, ఎంపీహెచ్‌ఏ శివగనేశ్వరరావు, ఏఎన్‌ఎం చంద్రకళ, ఆశ కార్యకర్త రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా ప్లాంటు పనులు పూర్తి చేయాలి



భద్రత ముగింపు వేడుకల్లో ప్రతిజ్ఞ చేస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు, అధికారులు

- సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు
- ఎస్టీపీపీలో ఘనంగా భద్రత ముగింపు వేడుకలు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ) విస్తరణలో భాగంగా నూతనంగా నిర్మించనున్న 800 మెగావాట్ల ప్లాంటు పనులు నిర్ణీత గడువులోగా 40 నెలల్లో పూర్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు తెలిపారు. జైపూర్ పవర్ ప్లాంటులోని ప్రాణహిత అతిథి గృహంలో శుక్రవారం కొత్త ప్లాంటు నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడో యూనిట్ నిర్మాణానికి సంబంధించి ముందస్తు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎస్టీపీపీలో 54వ జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు వేడుకల్లో డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ గోపాల్‌రావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ గంగాధర్‌రెడ్డితో కలిసి డైరెక్టర్ సత్యనారాయణవు పాల్గొని మాట్లాడారు. భద్రతకు సంబంధించి అన్ని నియమాలు పాటించాలని, జాగ్రత్త నియమాలు పాటించకపోవడం మూలంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం కార్మికులు భద్రతపై నాటికల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, ఏజీఎంలు మురళీధర్, మదన్‌మోహన్, డీజీఎంలు అజాజులఖాన్, కొత్త ప్లాంటు కోఆర్డినేటర్ వేణుగోపాలరావు, డీజీఎం లక్ష్మణ్, రాజేశ్, శివప్రసాద్, అజ్మీరా తుకారం, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ బ్రాంచ్ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, పవర్ మేక్ హెడ్ అఖిల్‌కపూర్, తదితరులు పాల్గొన్నారు.

కనీస పింఛన్ రూ.5 వేలు చెల్లించాలి



సమావేశంలో బీఎంఎస్ నాయకులు, అధికారులు

శ్రీరాంపూర్: బొగ్గు గని రిటైర్డ్ కార్మికులకు కనీస పింఛన్ రూ.5వేలు చెల్లించాలని బీఎంఎస్ బొగ్గు గనుల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి ట్రస్టీ బోర్డును డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో సీఎంపీఎఫ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ట్రస్టీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ట్రస్టీ చైర్మన్ విక్రమ్ దేవాదత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌పీఎస్ 1971 పింఛన్‌దారులకు ప్రస్తుతం ఉన్న పింఛన్ చాలా తక్కువగా ఉందన్నారు. ఎక్సెంజ్‌ట్రేడెడ్ ఫండ్‌లో పెట్టుబడుల శాతాన్ని 7 నుంచి 10వరకు పెంచేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. సీఎంపీఎఫ్ ప్రధాన కార్యాలయంలో కూడా పెట్టుబడులను అజమాయిషీ చేసే యంత్రాంగం ఉండాలన్నారు. సీఎంపీఎఫ్ సేవలన్నీ ఆన్‌లైన్ చేయాలని తమ నాయకుడు లక్ష్మారెడ్డి కోరారని బీఎంఎస్ సింగరేణి విభాగం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. పింఛన్ ఫండ్‌కు ప్రతీ టన్ను బొగ్గు అమ్మకంపై రూ.20 జమ చేయాలని సూచించగా బోర్డు సభ్యులతోపాటు సింగరేణి సీఎండీ కూడా అంగీకారం తెలిపారని అన్నారు.

సర్కార్ బడిలో ప్రీ ప్రైమరీ

- పాఠశాల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి
- ఇప్పటికే 26 పాఠశాలల్లో అమలు
- మరో 30 పాఠశాలల్లో నిర్వహణకు కసరత్తు



ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్న జన్నారం మండలం పోన్కల్ పాఠశాల

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పూర్వ ప్రాథమిక విద్య(ప్రీ ప్రైమరీ) విధానాన్ని ప్రవేశపెట్టి, ఐదేళ్లలోపు చిన్నారులకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. తద్వారా మూడేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చుకుని నాణ్యమైన విద్య అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం ఇప్పటికే జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో విజయవంతంగా అమలవుతోంది. మరిన్ని పాఠశాలలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

కొత్త ఒరవడి

ఇప్పటివరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఐదేళ్లు నిండిన విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పించేవారు. కొత్త విధానం ప్రకారం మూడేళ్లు నిండిన చిన్నారులను నర్సరీ తరగతుల్లో చేర్చుకోనున్నారు. గతేడాది నుంచి జిల్లాలో 26 పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనం. అదనంగా జిల్లాలో మరో 30 పాఠశాలల్లో ఈ విధానం అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సర్కారు బడుల్లో నూతన శకం ప్రారంభం కానుంది.

ఆర్థిక భారం తగ్గింపు

ప్రస్తుతం జిల్లాలో 511 ప్రాథమిక పాఠశాలల్లో 13,678 మంది, 97 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 4,234 మంది, 108 ఉన్నత పాఠశాలల్లో 23,442 మంది చదువుతున్నారు. ప్రీ-ప్రైమరీ విధానం అమలుతో మూడేళ్ల చిన్నారులూ చేరితే సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యకు వేలాది రూపాయల ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. సర్కారు బడుల్లో ఉచితంగా విద్య అందడంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గనుంది. అంగన్‌వాడీ కేంద్రాలతో సమన్వయం చేస్తూ ఈ కేంద్రాలు ఉన్న పాఠశాలలను ప్రీ-ప్రైమరీ కోసం ఎంపిక చేయనున్నట్లు సమాచారం. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఈ పాఠశాలలను గుర్తించి విద్యాశాఖకు నివేదిక సమర్పించనుంది.

జిల్లాలో అమలు విధానం

గతేడాది నుంచి జిల్లాలోని బెల్లంపల్లి, భీమారం, చెన్నూర్, దండేపల్లి, జన్నారం, కన్నెపల్లి, కాసిపేట, కోటపల్లి, లక్సెట్టిపేట, మందమర్రి, నెన్నెల, వేమనపల్లి మండలాల్లో ఉన్న 26 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు(పీపీ-1: నర్సరీ, పీపీ-2: యూకేజీ, పీపీ-3: ఎల్‌కేజీ) నిర్వహిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో 241మంది చిన్నారులు ఉన్నారు. ఈ పాఠశాలలు ప్రైవేట్ స్కూళ్లతో పోటీ పడి విద్యార్థుల సంఖ్యను పెంచుకుంటున్నాయి. జనకాపూర్, జెండా వెంకటపూర్, సుద్దాలలోని పీఎంశ్రీ పాఠశాలలు ఈ కార్యక్రమంలో ముందంజలో ఉన్నాయి. కొన్ని నాన్-పీఎంశ్రీ పాఠశాలల్లో బోధకులకు రూ.8 వేలు, ఆయాలకు రూ.6 వేల చొప్పున 10 నెలలపాటు గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో డీఈడీ, టెట్ అర్హత ఉన్న స్థానిక అభ్యర్థులను బోధకులుగా నియమిస్తున్నారు. కిష్టాపూర్, చంద్రవెల్లి, ఎంపీపీఎస్ బీసీ హాజిం కాలనీ, ధర్మారం, తుర్కపల్లి, పోన్కల్, నంబాల వంటి పాఠశాలలు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాయి.

భవిష్యత్ ప్రణాళికలు..

ప్రభుత్వం మరో 30 పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విధానాన్ని అమలు చేయడానికి ఆమోదం తెలిపింది. దీంతో నిరుద్యోగ యువతలో ఉపాధి అవకాశాలపై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రీ-ప్రైమరీలో చేరే చిన్నారులకు ముఖ్యమంత్రి పేరిట ప్రత్యేక కిట్‌లు అందించే ఆలోచన ఉన్నట్లు సమాచారం. అయితే, కొత్తగా ఏర్పాటయ్యే పాఠశాలలకు సంబంధించి విధివిధానాలపై స్పష్టత రావాల్సి ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు.

నిధుల కేటాయింపు..

ప్రీ-ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం సమగ్ర శిక్ష తెలంగాణ నుంచి రూ.11,95,500 మంజూరయ్యాయి. జిల్లాలోని ఏడు పాఠశాలలకు ఈ బడ్జెట్ కేటాయించారు, ఇందులో..

బోధకుల గౌరవ వేతనం: నెలకు రూ.8 వేల చొప్పున రూ.5.44 లక్షలు
ఆయాల గౌరవ వేతనం: నెలకు రూ.6,000 చొప్పున రూ.4,08 లక్షలు
ఇండోర్ మెటీరియల్: రూ.1.40లక్షలు
హెల్త్ అండ్ సానిటేషన్: రూ.70వేలు
టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం): రూ.33,500

పీఎంశ్రీ పాఠశాలలకు బోధకులు, ఆయాలతోపాటు ప్లే మెటీరియల్, ఇతర సామగ్రి అందుతుండగా, నాన్-పీఎంశ్రీ పాఠశాలల్లో ఈ సౌకర్యాలు పరిమితంగా ఉన్నాయి. మిగిలిన 16 పాఠశాలలకు బడ్జెట్ కేటాయింపు కోసం ప్రతిపాదనలు పంపించారు.

క్లుప్తంగా

లభ్యం కాని ఆచూకీ


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సారంగాపూర్: మండలంలోని ధని గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాత్రి సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొట్టగా మృతిచెందిన విషయం విదితమే. మృతిచెందిన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసు యంత్రాంగం విచారణ చేపట్టింది. సోషల్ మీడియాలో వ్యక్తికి సంబంధించిన ఫొటోలు, వివరాలు అప్‌లోడ్ చేసినా ఇంతవరకు ఆచూకీ లభ్యం కాలేదు. వివరాలు తెలిస్తే సారంగాపూర్ ఎస్సై 8712659516కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

'దొంగల సమాచారమివ్వాలి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేంపల్లిలో ఈ నెల 7న నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను చోరీ చేసిన విషయంలో ఎస్సై స్వరూప్‌రాజ్ శుక్రవారం ముందస్తు జాగ్రత్తలు తెలియజేశారు. ఆటో గ్యారెజీల్లో, ఇళ్ల ముందర నిలిపి ఉంచిన ఆటోలను లక్ష్యంగా చేసుకుంటూ ఈ ముఠా దొంగతనాలకు పాల్పడుతుందన్నారు. వీరు ఉపయోగిస్తున్న ఆటో టాప్‌పై జెడ్‌ఐడీడీఐ అనే ఇంగ్లిష్ అక్షరాలు ఉన్నాయని తెలిపారు. ఈ దొంగల ఆటో వివరాలు కానీ, సంబంధించిన వ్యక్తుల సమాచారం కానీ తెలిస్తే వెంటనే 87126 56541 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇస్తామని ఎస్సై ప్రకటించారు.

దాడి కేసులో ఇద్దరు రిమాండ్

దండేపల్లి: ఒకరిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. మండలంలోని కాసిపేటకు చెందిన కల్లెం సంతోష్‌పై అదే గ్రామానికి చెందిన సృజన్, మల్లేశ్‌లు డబ్బుల విషయంలో ఈనెల 15న నర్సాపూర్ శివారులో గొడవపడి దాడి చేశారు. ఈమేరకు కేసు నమోదు కాగా, సృజన్, మల్లేశ్‌లను శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు.

కారు బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కడెం: మితిమీరిన వేగం.. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నబెల్లాల్‌కు చెందిన బక్కతట్ల వెంకటేశ్ తన కారులో నేతుల వెంకటేశ్‌తో కలిసి గురువారం రాత్రి పాండ్వపూర్ వైపు నుంచి బెల్లాల్ వెళ్తుండగా పాండ్వపూర్ హనుమాన్ ఆలయ సమీపంలోని మూలమలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ప్రమాద సూచికను, విద్యుత్ స్తంభాన్ని, ఆలయం ఇనుప కంచెను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని ఇద్దరిని నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

'పచ్చడి' మెతుకులు కరువేనా!

- నిరాశజనకంగా మామిడి పంట
- పెరుగనున్న ధరలు
- మంచిర్యాల జిల్లాలో 15,680 ఎకరాల్లో తోటలు


చెన్నూర్ మండలం కన్నెపల్లిలోని మామిడి తోట

చెన్నూర్: మంచిర్యాల జిల్లాలో మామిడి కాయల కాపు నిరాశజనకంగా ఉంది. వాతావరణ మార్పుల కారణంగా పూతకు తెగుళ్లు సోకడంతో పూత రాలిపోయి కాత నిలువలేదు. దీంతో దిగుబడి అమాంతం తగ్గింది. లక్షలాది రూపాయలతో తోటలను కౌలుకు తీసుకున్న రైతులు పెట్టిన పెట్టుబడి వచ్చేదెలా అని తలలు పట్టుకుంటున్నారు. మామిడి దిగుబడి తగ్గడంతో ధరలు రెండింతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల వారు 'పచ్చడి' మెతుకులకు సైతం దూరమయ్యే పరిస్థితులు ఉన్నాయి.

15,680 ఎకరాల విస్తీర్ణంలో..

మంచిర్యాల జిల్లా మామిడి సాగుకు పెట్టింది పేరు. జిల్లా మామిడికి హైదరాబాద్‌తో పాటు వివిధ రాష్ట్రాలలో మంచి డిమాండ్ ఉంది. జిల్లాలో 6554 మంది రైతులు ఉండగా 15,680 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. జిల్లాలోని బెల్లంపల్లి, నెన్నల, భీమారం, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, లక్షెట్టిపేట, తాండూర్, దండెపల్లి మండలాలలో మామిడి తోటలు ఉన్నాయి. పది మండలాలలో మామిడి తోటలు ఉన్నప్పటికీ అత్యధికంగా తోటల విస్తీర్ణం బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నల, తాండూర్, చెన్నూర్ నియోజవర్గంలోని భీమారం, జైపూర్, చెన్నూర్ మండలాలలో ఉన్నాయి. జిల్లాకు చెందిన రైతులు దసరి, బంగెనపల్లి, పెద్ద రసాలు, హిమస్‌పసందు వంటి మేలైన మామిడి రకాలను మహారాష్ట్రలోని నాగాపూర్, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడి అంతంత మాత్రంగా ఉండడంతో పక్క రాష్ట్రాలకు ఎగుమతి అయ్యే అవకాశాలు లేవని మామిడి వ్యాపారులు పేర్కొంటున్నారు.

ధరలు పెరిగే అవకాశం..!

జిల్లా వ్యాప్తంగా మామిడి కాయల దిగుబడులు తగ్గాయి. ఇందులో తినే మామిడి 20శాతం దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉండగా, పచ్చడి మామిడి 10శాతం దిగుబడి కూడా లేదు. దీంతో పచ్చడి మామిడి కాయలు కరువయ్యే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చడి మామిడి ధరలు ఆకాశాన్నంటుతున్నాయని కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది పచ్చడి మామిడి వంద కాయలకు రూ.150 నుంచి రూ.200 పలికింది. ఈ ఏడాది వంద పచ్చడి మామిడి కాయలకు రూ. 250 నుంచి రూ.300 పలుకుతుందని పచ్చడి ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి తగ్గింది..



ఈ ఏడాది మామిడి కాయ నిలువలేదు. చెట్టుకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల కాయ దిగుబడి వచ్చేది. ఈ ఏడాది చెట్టుకు 10 నుంచి 20 కిలోల దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదు. కాయ దిగుబడి తక్కువగా ఉండడంతో మామిడి కాయల ధరలు పెరిగే అవకాశం ఉంది. – నాయిని తిరుపతి, వ్యాపారి

పేదలకు కష్టమే..



మామిడి ధరలు పెరిగితే పేదలు మామిడి పండ్లు తినలన్నా, పచ్చడి పెట్టాలన్నా కష్టమే. ఈ ఏడాది మామిడి తక్కువ కాచింది. ఇప్పుడే ధరలు మండుతున్నాయి. రానున్న రోజులలో మరింత ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. – బొగె సారయ్య, చెన్నూర్

బాసర ఆలయంలో భక్తుల కిటకిట


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

బాసర: చదువుల తల్లి సరస్వతి అమ్మవారు కొలువైన బాసర పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో క్యూలైన్‌లో వేచి ఉన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శ్రీ సరస్వతి, మహాలక్ష్మి, మహాంకాళి అమ్మవార్లకు అభిషేకం, అర్చన పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గోదావరి నదీ తీరం భక్తుల పుణ్యస్నానాలతో రద్దీగా మారింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి 2గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు వెల్లడించారు.


అక్షరాభ్యాస మండపంలో పూజలు చేస్తున్న భక్తులు

జొన్న చేనులో పుస్తకావిష్కరణ


జొన్న చేనులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రైతు

తాంసి: ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత డా.ఉదారి నారాయణ రచించిన 'యాప చెట్టు కాడ ఊరుమీద ముచట్లు' పుస్తకాన్ని శుక్రవారం జొన్న చేనులో రైతు చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండలంలోని సావర్గాం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు సట్వాజీ తన జొన్నపంట చేనులో పనులు చేస్తుండగా పుస్తక రచయిత ఉదారి నారాయణ మిత్రులతో కలిసి వెళ్లి చేనులోనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో దక్కన్ గ్రామీణ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ సామల వీరన్న, తెలుగు భాష ఉపాధ్యాయులు గంగన్న, గ్రామ పెద్దలు జీవన్, రాములు, గంగయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య


కదం బాలాజీ (ఫైల్)

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామానికి చెందిన కదం బాలాజీ (45) అనే రైతు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రైతు బాలాజీ కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈసారి తనకున్న రెండెకరాల్లో వ్యయప్రయాసలకోర్చి పత్తి పంట సాగు చేశాడు. పత్తి పంట దిగుబడి సరిగా రాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ట్రెయినీ ఎస్సై నవనీత్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శుక్రవారం బాలాజీ భార్య మోనాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెల్లడించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా గత ఆరు నెలల క్రితం కూడా బాలాజీ ఆత్మహత్యాయత్నం చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

స్తంభంపై నుంచి పడి తీవ్ర గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చంద్రయ్య

నెన్నెల: కరెంట్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా పట్టుతప్పి కింద పడడంతో కాంట్రాక్టు ఉద్యోగి రెండు కాళ్లు విరిగిన ఘటన నెన్నెల మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన సోదారి చంద్రయ్య విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పదేళ్లుగా పని చేస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం గంగారాం శివారులోని మైసమ్మ ఆలయం వద్ద కరెంట్ స్తంభంపైన మరమ్మతుల కోసం స్తంభం ఎక్కాడు. కరెంట్ వైర్ సరి చేస్తుండగా పట్టు తప్పి కింద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను సహచర సిబ్బంది మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు చంద్రయ్యకు రెండు కాళ్లు విరిగినట్లు నిర్ధారించారు. ప్రస్తుతం ఆయనకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న దగ్ధం


కాలిపోయిన మొక్కజొన్న పంట

సారంగపూర్: మండలంలోని ధని గ్రామంలో ప్రమాదవశాత్తు ఆరబెట్టిన మొక్కజొన్న పంట దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన శనిగారపు చిన్నరాజేశ్వర్ ఎకరంలో మొక్కజొన్న సాగు చేశాడు. పంట కోతకోసి ఆరేందుకు పంటపొలంలో ఉంచాడు. శుక్రవారం రైతు పంటను పరిశీలించి ఇంటికి వెళ్లిన తర్వాత ప్రమాదవశాత్తు పంటకు నిప్పంటుకుంది. ఇతర రైతులు గమనించి రాజేశ్వర్‌కు సమాచారం అందించారు. బోరు బావుల మోటార్లు ఆన్ చేసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే 90శాతం పంట అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.80వేల పంట నష్టం జరిగిందని రైతు వాపోయాడు. ఎంఆర్‌ఐ నర్సయ్యకు ఫోన్‌లో సమాచారం అందించగా ఆయన సంఘటన స్థలానికి చేరుకుని పంటనష్టం అంచనా వేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


చంద్రయ్య (ఫైల్)

దండేపల్లి: మండలంలోని ముత్యంపేట సమీపంలో గురువారం రాత్రి బొలెరో-ఆటో ఢీకొన్న ఘటనలో కొర్విచెల్మ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొట్టె చంద్రయ్య (49) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై తహసీనొద్దీన్ కథనం ప్రకారం.. చంద్రయ్య తన ఆటోతో లక్సెట్టిపేట నుంచి ప్రయాణికుడిని ఎక్కించుకుని కొర్విచెల్మకు వస్తుండగా, మార్గమధ్యలో ముత్యంపేట సమీపంలో జన్నారంవైపు నుంచి లక్సెట్టిపేట వైపు ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ చంద్రయ్యకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న రాజుకు కాలు విరిగింది. అజాగ్రత్తగా అతివేగంతో బొలెరోను నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని చంద్రయ్య తల్లి కొట్టె బుచ్చవ్వ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బిల్డింగ్‌పై నుంచి పడి మహిళ మృతి


రుక్మిణీ (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన సముద్రాల రుక్మిణీ (75) ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం బానేశ్ అనే యువకుడి సహాయంతో ఇంటిపైన ఉన్న పిల్లర్‌కు జెండా కడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి పడింది. తలకు తీవ్ర గాయం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందింది. కాగా మృతురాలి కుటుంబసభ్యులు మాజీ జెడ్పీటీసీ సముద్రాల సరిత రాజన్నను పలువురు పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు.

మంచంపై నుంచి పడి వ్యక్తి..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామన్న

లక్సెట్టిపేట: మున్సిపల్ పరిధి అంగడిబజార్‌కు చెందిన నౌసర్ అలీ (42) అనే వ్యక్తి మంచంపై నుంచి కింద పడి మృతి చెందినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నౌసర్ అలీ గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం లేచి చూసే సరికి మంచంపై నుంచి కింద పడి ఉన్నాడు. నుదిటిపై రక్తపు గాయాలు ఉండగా కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నుదిటికి బలమైన గాయం కావడంతోనే నౌసర్ అలీ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన భార్య నూర్జన్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్ విధులకు ఆటంకం.. ముగ్గురు అరెస్ట్

మంచిర్యాలక్రైం: బ్లూకోట్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఈనెల 13న రాత్రి 12.30 గంటలకు జిల్లాకేంద్రంలోని హరికృష్ణ లాడ్జి ఎదుట ముగ్గురు వ్యక్తులు ఇతరులకు ఇబ్బంది కలుగజేస్తున్నారని డయల్ 100కు కాల్ రాగా బ్లూకోట్ విధుల్లో ఉన్న హోంగార్డ్‌లు సత్యనారాయణ, రవిలు అక్కడికి వెళ్లారు. ఇతరులను ఇబ్బంది పెట్టకుండా అక్కడి నుంచి వెళ్లిపోవాలని సదరు వ్యక్తులకు సూచించారు. విధుల్లో ఉన్న పోలీసులను సైతం లెక్క చేయకుండా వారితో దురుసుగా ప్రవర్తించడంతో పాటు నానా దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించారు. దీంతో శ్రీరాంపూర్ అరుణక్కనగర్‌కు చెందిన ఓ మైనర్ బాలుడితో పాటు బానోత్ సాయివికాస్, సీలారపు వినయ్‌లపై సత్యానారాయణ ఫిర్యాదు చేశారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

'చరిత్ర ఆనవాళ్లు లభ్యం'


లభ్యమైన రాళ్లు

బోథ్: మండలంలోని దన్నూరు(బి) గ్రామ సమీపంలోని తూర్పు దిక్కున గల కొంకన్న గుట్ట ప్రాంతంలో లక్షల సంవత్సరాలు క్రితం ఆదిమానవులు ఉపయోగించిన రాళ్లు లభ్యమైనట్లు బోథ్ ఎఫ్ఆర్‌వో ప్రణయ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తన బృందంతో కలిసి అడవిని పరిశీలించే క్రమంలో చరిత్రకు సంబంధించిన పలు ఆనవాళ్లు లభ్యమైనట్లుగా పేర్కొన్నారు. కొంకన్నగుట్ట మధ్యలో సూక్ష్మరాతి మొనదేలిన అత్యంత చురుకైన చాకు లాంటి రాళ్లు అనేకం ఉన్నాయన్నారు. పొచ్చెర జలపాతం చుట్టుపక్కల సైతం లక్షల ఏళ్ల నాటి ఆదిమ సమాజం ఆనవాళ్లు నేటికీ భద్రంగా కనిపిస్తున్నాయని తెలిపారు.

'కన్నయ్య కుటుంబానికి న్యాయం చేస్తాం'


కుటుంబసభ్యులతో చర్చిస్తున్న ఏసీపీ

వేమనపల్లి: మంగెనపల్లిలో ఆత్మహత్యకు పాల్పడిన నాయిని కన్నయ్య కుటుంబానికి చెందిన భూ సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో కన్నయ్య కుటుంబ సభ్యులు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, సీపీఎం నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. వేమనపల్లి శివారు 464 సర్వే నంబర్‌లో కన్నయ్య తల్లి ఎల్లక్క పేరు మీద ఉన్న భూమి ఎనగంటి చిన్నన్న కొడుకు హరీశ్ పేరు మీదకు ఎలా పట్టా మార్చారన్న విషయమై విచారణ జరిపారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి రికార్డు పరంగా వివరాలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఏసీపీ వెంట చెన్నూర్ రూరల్‌సీఐ సుధాకర్, ఎస్సై శ్యాంపటేల్, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న, మల్లేశ్వరి ఉన్నారు.

గంజాయి రవాణా.. ముగ్గురు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

జైపూర్: జల్సాలకు అలవాటుపడ్డ ముగ్గురు యువకులు ఆసిఫాబాద్ నుంచి వేలాలకు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్‌తో కలిసి ఏసీపీ వెంకటేశ్వర్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. వేలాల గ్రామానికి చెందిన దుర్గం సాయి కార్తీక్, సుందిళ్ల సంపత్, ప్యాగా శేఖర్‌లు బైక్‌పై ఆసిఫాబాద్‌కు వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల వద్ద సుమారు 500గ్రాముల గంజాయిని రూ.5వేలకు కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా తయారు చేస్తున్నారు. అనంతరం ఒక్కో ప్యాకెట్‌ను రూ.500ల చొప్పున విక్రయిస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం గంజాయి విక్రయించేందుకు వెళ్తుండగా వేలాల ఇసుక క్వారీ వద్ద ముగ్గురు యువకులను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 290గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీయాక్టులు సైతం నమోదు చేస్తామని ఏసీపీ హెచ్చరించారు. సమావేశంలో జైపూర్ రెండో ఎస్సై రామలక్ష్మి ఉన్నారు.

యువతిని వేధించిన యువకుడి అరెస్ట్


యువకుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని సోషల్ మీడియాలో వేధించిన నిజామాబాద్ జిల్లా రేంజల్ మండలంలోని కందుకుర్తి గ్రామానికి చెందిన అలీమ్ బేగ్ అనే యువకుడిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు బోథ్ ఎస్సై ఎల్. ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని గత కొంతకాలంగా సోషల్ మీడియాలో అలీమ్‌బేగ్ వేధిస్తున్నాడు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి అలీమ్‌బేగ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా అలీమ్‌బేగ్‌పై రౌడీషీట్ ఉన్నట్లు వారు పేర్కొన్నారు. రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో నాలుగు కేసులు, డిచ్‌పెల్లి పోలీస్‌స్టేషన్‌లో 2023 లో అలీమ్‌బేగ్ వద్ద నుంచి 17 బైక్‌లు రికవరీ చేసినట్లు తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత


పట్టుకున్న నకిలీ విత్తనాలతో పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి, బోడపల్లి గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన నకిలీ పత్తి విత్తనాలను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అందవెల్లి, బోడపల్లి గ్రామాలను అడ్డాలుగా చేసుకొని నకిలీ బీటీ -3 పత్తి విత్తనాలు కాగజ్‌నగర్ మీదుగా సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాయనే పక్కా సమాచారంతో గ్రామంలో దాడులు చేసినట్లు తెలిపారు. దాడుల్లో అందవెల్లి గ్రామానికి చెందిన ఎస్.మహేందర్ ఇంట్లో వంద కిలోల నకిలీ విత్తనాలు పట్టుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి విచారించినట్లు తెలిపారు. మహేందర్ మంచిర్యాల జిల్లాలోని పెద్దపేట్ గ్రామానికి చెందిన ఎస్‌కే సల్మాన్ వద్ద నుంచి నకిలీ పత్తి విత్తనాలు తీసుకొని అందవెల్లి, బోడపల్లి, ఇట్యాల, రెబ్బెన మండలంలోని పలు గ్రామాల్లో విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు తెలిపారు. మహేందర్ వద్ద నుంచి రూ. 3.50 లక్షల విలువైన క్వింటాల్ నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అమాయక రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్, కానిస్టేబుల్స్ మధు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీడిన మల్లక్క హత్య కేసు మిస్టరీ

- నిందితుడి అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన పోలీసులు


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్సైలు

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఆదివారంపేటలో ఈనెల 13న జరిగిన వృద్ధురాలి హత్య కేసు మిస్టరీ వీడింది. కాటారం పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నాగార్జునరావు వివరాలు వెల్లడించారు. ఆదివారంపేటకు చెందిన ఒడేటి మల్లక్క (67) భర్త రామయ్య, కుమారుడు రమేశ్ కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. గ్రామంలో కిరాణం నడుపుకుంటూ ఆమె ఒంటరిగా జీవిస్తోంది. మల్లక్క కుమారుడు చనిపోగా కోడలు శ్రీలతకు నిందితుడు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బారెగూడకు చెందిన మోరలే శివ అలియాస్ శివాజీతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు మూడేళ్లపాటు కాగజ్‌నగర్‌లో సహజీవనం చేశారు. శివ వేధింపులు తట్టుకోలేక శ్రీలత అతడిని వదిలిపెట్టి ఆదివారంపేటకు వచ్చి ఉంటోంది. నిందితుడు శివ పలుమార్లు శ్రీలత వద్దకు వచ్చి కలుద్దామని అడగ్గా ఆమె నిరాకరించింది. దీంతో కక్ష పెంచుకున్న శివ ఆమె అత్తను అంతమొందిస్తే ఆస్తి కోసం శ్రీలత హత్య చేసిందని కేసు ఆమె పైకి వెళ్తుందని ప్రణాళిక రచించాడు. పథకం ప్రకారం ఈనెల 12న అర్ధరాత్రి మల్లక్క ఇంటికి వెళ్లిన శివ.. నిద్రిస్తున్న మల్లక్క తలపై గొడ్డలితో బాదాడు. దీంతో తీవ్రంగా గాయపడిన మల్లక్క మంచంలోనే మృతిచెందగా నిందితుడు గొడ్డలి అక్కడే పడేసి పరారయ్యాడు. మరుసటి రోజు డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, మహదేవపూర్ సీఐ రాంచంద్రరావు, ఎస్సై -2 శ్రీనివాస్ ఘటనా స్థలిని పరిశీలించారు. మృతురాలి కూతురు శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పలు ఆధారాల సాయంతో శివను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సైలు మ్యాక అభినవ్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



రోజంతా ఉల్లాసంగానే...

చాలామంది రోజంతా నీరసంగా.. నిస్సత్తువగా గడుపుతుంటారు. దీనివల్ల శరీరం నిస్తేజంగా మారడమే కాకుండా అనేక రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అయితే కొన్ని చిన్నపాటి మార్పుల ద్వారా రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండవచ్చు. అవేంటో చూద్దాం..



తగినంత నిద్ర.. ప్రతిరోజూ కనీసం 7–8 గంటలు నిద్ర పోవడం చాలా ముఖ్యం. నిద్రలేమి చిరాకు, నీరసానికి దారితీస్తుంది.

ఆరోగ్యకరమైన ఆహారం.. పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రోటీన్లు శరీరానికి శక్తినిస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర ఎక్కువగా ఉండే వాటిని తగ్గించడం మంచిది.

వ్యాయామం.. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వల్ల మీ మానసిక స్థితి మెరుగుపడుతుంది. శక్తి స్థాయిలు పెరుగుతాయి. నడవడం, యోగా, డ్యాన్స్ లేదా ఇష్టమైన ఏదైనా శారీరక శ్రమ చేయవచ్చు.



నీరు తాగడం.. రోజంతా తగినంత నీరు తాగడం చాలా అవసరం. డీహైడ్రేషన్ వల్ల అలసట, చిరాకు కలగవచ్చు.

ధ్యానం, విశ్రాంతి.. ప్రతిరోజూ కొంత సమయం ధ్యానం లేదా రిలాక్సేషన్ టెక్నిక్స్ కోసం కేటాయించండి. ఇది ఒత్తిడిని తగ్గించడానికి, మనస్సును ప్రశాంతంగా ఉంచడానికి సహాయపడుతుంది.

పాజిటివ్ ఆలోచనలు.. ప్రతికూల ఆలోచనలను తగ్గించుకుని సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోండి. కృతజ్ఞత కలిగి ఉండటం కూడా చాలా ముఖ్యం.

ఇష్టమైన పనులు చేయడం.. ఆనందం కలిగించే హాబీలు లేదా పనుల కోసం సమయం కేటాయించడం మన మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది.

సామాజిక సంబంధాలు.. స్నేహితులు, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఇతరులతో మాట్లాడటం, కనెక్ట్ అవ్వడం మానసిక ఆరోగ్యానికి చాలా ముఖ్యం.

కొత్త విషయాలు నేర్చుకోవడం.. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం లేదా కొత్త విషయాలు తెలుసుకోవడం మీ మనస్సును ఉత్తేజపరుస్తుంది, ఉల్లాసంగా ఉంచుతుంది.

రోజువారీ అలవాట్లు.. ఉదయం లేవగానే సహజమైన సూర్యకాంతిలో గడపడం శరీరపు జీవ గడియారాన్ని క్రమబద్ధీకరించడానికి సహాయపడుతుంది, ఉల్లాసంగా ఉంచుతుంది.

చిన్న చిన్న విరామాలు.. మీరు ఎక్కువసేపు ఒకే పనిలో ఉంటే, మధ్యలో చిన్న విరామాలు తీసుకోండి. లేచి కొంచెం నడవండి లేదా స్ట్రెచ్ చేయండి.

పనులు ప్లాన్ చేసుకోవడం.. రోజువారీ పనులను ఒక క్రమంలో ప్లాన్ చేసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది, మరింత నియంత్రణలో ఉన్నట్లు అనిపిస్తుంది.

నవ్వండి, నవ్వించండి.. నవ్వడం ఒక గొప్ప ఒత్తిడి నివారిణి, హాయిగా నవ్వుకోడం మానసిక స్థితిని తక్షణం మెరుగుపరుస్తుంది.

ఈ చిట్కాలను జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా రోజంతా ఉల్లాసంగాఉత్సాహంగా ఉండగలగడం ఎవరికైనా సాధ్యమే.ఒకవేళ మీకు ఏవైనా ప్రత్యేకమైన ఆందోళనలు ఉంటే, వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది.



లైఫ్@360

ప్రాణాయామంతో మనస్సు, శరీరం రీఛార్జ్

● యోగా



యోగాలో ప్రాణాయామం ప్రయోజనాలు యోగాకు మించి ఉంటాయి. శ్వాస మీద పని చేస్తున్నప్పుడు, శరీరంలోని టాక్సిన్స్‌ను తొలగిస్తూనే తగినంత ఆక్సిజన్ సరఫరాతో శ్వాసను నియంత్రించడం, సరైన విధంగా సాధన చేయడం ఈ యోగాలో కీలకం. శరీరాన్ని రీఛార్జ్ చేయడం ద్వారా ఇది పనిచేస్తుంది. ప్రాణాయామం జీర్ణాశయానికి ఆక్సిజన్ సరఫరాను పెంచుతుంది, మెరుగైన జీర్ణక్రియ కోసం రక్త ప్రవాహాన్ని, ప్రేగుల బలాన్ని పెంచుతుంది. యోగా ఆసనాలతో కలిపి చేసే ప్రాణాయామం ఒత్తిడిని తగ్గిస్తుంది. జీవక్రియ వ్యర్థాలను తొలగిస్తుంది.

సాధన చేయడానికి...

ప్రాణాయామం చేయడానికి, ఒక ప్రశాంతమైన స్థానంలో కూర్చొని, వెన్నును నిటారుగా ఉంచాలి. రెండు కళ్ళను మూసి, శ్వాసను లోపలికి పీల్చుకోవాలి. కొన్ని క్షణాలు ఆ శ్వాసను బిగించి, తర్వాత నెమ్మదిగా బయటకు వదిలేయాలి. ఈ ప్రక్రియను పదే పదే పునరావృతం చేయడం వల్ల శరీరానికి, మనసుకు ప్రశాంతత చేకూరి శక్తిమంతం అవుతాయి. శ్వాస సాధన ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

మెరుగైన ఆరోగ్యానికి మల్బరీ జ్యూస్



తియ్య తియ్యగా... పుల్ల పుల్లగా ఉండే మల్బరీ పండ్లు అన్ని కాలాలలోనూ అందుబాటులో ఉంటాయి. మల్బరీ పండ్లతో చేసిన జ్యూస్ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుంది. అవేమిటో చూద్దాం..

మల్బరీలో ఉండే డైటరీ ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచి మలబద్ధకం, కడుపులో మంటలను తగ్గిస్తుంది.

గుండె ఆరోగ్యానికి మల్బరీ యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉండి రక్తనాళాల పనితీరును మెరుగుపరచి రక్తం గడ్డ కట్టకుండా చేస్తుంది. తద్వారా స్ట్రోక్స్, గుండెపోటు వంటి సమస్యలను నివారిస్తుంది.

రోగనిరోధక శక్తి పెంపు: మల్బరీలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని వ్యాధులకు వ్యతిరేకంగా శక్తిమంతమైన రక్షణను అందిస్తుంది.

ఎముకల ఆరోగ్యానికి: మల్బరీలోని విటమిన్ కె, కాల్షియం, ఐరన్ వంటి ఖనిజాలు ఎముకల ఆరోగ్యానికి మంచిది.

కంటి చూపు మెరుగు: మల్బరీ జ్యూస్‌లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది కాబట్టి ఇది తాగడం వల్ల చూపు మెరుగుపడుతుంది. కంప్యూటర్ ముందు గంటల తరబడి పనిచేసే వారికి కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది.

వేగంగా కోలుకోవడానికి తోడ్పడుతుంది: శస్త్రచికిత్స తర్వాత రోగులకు మల్బరీ జ్యూస్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిస్తుంది.

జుట్టు సహజ రంగును నిలుపుకుంటుంది: మల్బరీ జుట్టులో మెలనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది జుట్టు సహజ రంగును నిలుపుకోవడానికి సహాయపడుతుంది, జుట్టు నెరిసిపోవడాన్ని తగ్గిస్తుంది.

మెదడు ఆరోగ్యానికి మంచిది: మల్బరీలో న్యూరోప్రొటెక్టివ్ లక్షణాలను కలిగి ఉన్న వివిధ బయో యాక్టివ్ సమ్మేళనాలు మెదడు కణాలను ఒత్తిడి నుంచి రక్షించి ఐక్యూను మెరుగుపరుస్తాయి. మల్బరీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కణాలను ఆక్సీకరణ ఒత్తిడి, నష్టం నుంచి రక్షించడంలో సహాయపడతాయి. ఊపిరితిత్తుల ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

చివరగా... ప్రయోజనాలు ఉన్నాయి కదా అని ఈ జ్యూస్‌ని విపరీతంగా తాగ కూడదు. పరిమితి పాటించడం మంచిది.

మండే ఎండల్లోనూ ఆరోగ్యంగా...



ఎండాకాలం కాసేపు బయటికి వెళితే చాలు ముఖచర్మం కమిలిపోతుంది. విపరీతంగా చెమటలు పోస్తాయి. నీరసం, నిస్త్రాణ కలుగుతాయి. కాసేపు పని చేస్తే చాలు శరీరం అలసిపోయి, సొమ్మసిల్లినట్లు అవుతుంది. అందువల్ల బయటికి వెళ్లేటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఎండల్లోనూ ఆరోగ్యంగా ఉండవచ్చు. అవేమిటో చూద్దాం...

● మంచినీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటినుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడం అలవాటుగా మార్చుకోండి.

● గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.

● నిమ్మరసం వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.



సాక్షి సినిమా

అప్పనా తనామనా పాట బాగుంది

- సుకుమార్



● సువిక్షిత్, సుకుమార్, గీతిక

''**దూ**రదర్శిని' హీరో సువిక్షిత్ నా రూపం వచ్చేటట్లు వరిపొలంలో ఫార్మింగ్ చేశాడు. అప్పటి నుంచి తనతో నాకు పరిచయం ఉంది. తనకి సినిమా అంటే ప్యాషన్. ఈ మూవీ నుంచి నేను రిలీజ్ చేసిన 'అపనా తనామనా...' పాట చాలా బాగుంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అని దర్శకుడు సుకుమార్ అన్నారు. సువిక్షిత్ బొజ్జ, గీతికా రతన్ జంటగా నటించిన చిత్రం 'దూరదర్శని'. 'కలిపింది ఇద్దరిని' అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో బి. సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మించారు. ఆనంద్ గుర్రాన సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'అపనా తనామనా...' అనే పాట లిరికల్ వీడియోను సుకుమార్ విడుదల చేశారు. సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించిన ఈ పాటని సింధుజ, శ్రీనివాసన్ ఆలపించారు. సువిక్షిత్ బొజ్జ మాట్లాడుతూ– ''నా అభిమాన దర్శకుడు సుకుమార్‌గారి చేతుల మీదుగా మా మూవీ సాంగ్ రిలీజ్ కావడం సంతోషంగా, గర్వంగా ఉంది. ఈ సినిమా అందర్నీ 90వ దశకంలోకి తీసుకెళ్లి మీ జ్ఞాపకాల్ని, ప్రేమకథలను గుర్తుకు తెస్తుంది''అని తెలిపారు.

కథ గమ్మత్తుగా అనిపించింది

- నవీన్ చంద్ర



● రాకేశ్ వర్మ, రాశీ సింగ్, నవీన్ చంద్ర

''**బ్లైండ్ స్పాట్**' మంచి థ్రిల్లర్ మూవీ. రాకేష్ కథ చెప్పినప్పుడు గమ్మత్తుగా అనిపించింది. ఈ మూవీ స్క్రీన్‌ప్లే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ సినిమా నాకు వైవిధ్యమైన అనుభూతి ఇచ్చింది. కథను నమ్మి ఒక్కొక్క సినిమా చేసుకుంటూ ముందుకు వస్తున్నాను. ఎప్పటిలాగే 'బ్లైండ్ స్పాట్'కి కూడా ప్రేక్షకుల ప్రోత్సాహం ఉండాలని కోరుకుంటున్నాను'' అన్నారు నవీన్ చంద్ర. రాకేష్ వర్మ దర్శకత్వంలో నవీన్ చంద్ర, రాశీ సింగ్ జోడీగా నటించిన చిత్రం 'బ్లైండ్ స్పాట్'. మ్యాంగో మాస్ మీడియా బ్యానర్‌పై రామకృష్ణ వీరపనేని నిర్మించారు. శుక్రవారం నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో **నవీన్ చంద్ర మాట్లాడుతూ–** ''మా సినిమా పోస్టర్లో ఒక క్లూ ఉంది. అది కనిపెట్టి నాకు మెసేజ్ చేస్తే వాళ్లతో కలిసి నేను ఈ చిత్రం చూస్తాను'' అన్నారు. **రాశీ సింగ్ మాట్లాడుతూ–** ''ఈ సినిమా అంతా నా పాత్ర ఏడుస్తూనే ఉంటుంది. సినిమా బాగా వచ్చింది'' అని చెప్పారు. **రాకేష్ వర్మ మాట్లాడుతూ–** ''మా సినిమా కథ మొత్తం ఒక రాత్రిలో జరుగుతుంది. నవీన్ చంద్ర తన పాత్రలో చాలా లీనమై నటించారు. రాశీ సింగ్ గ్లిజరిన్ లేకుండా కన్నీళ్లు తెచ్చుకునేంత మంచి నటి'' అన్నారు.

వాళ్లు ఐ లవ్ యూ చెప్పలేదు

- కమల్‌హాసన్



● అభిరామి, షణ్ముగమూర్తి, ఏఆర్ రెహమాన్, మణిరత్నం, కమల్‌హాసన్, త్రిష, శింబు

''థగ్ లైఫ్' సినిమాలో శింబు, త్రిష, అభిరామి, జోజు జార్జ్ వంటి నటీనటులతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. అయితే ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లు (త్రిష, అభిరామి) ఉన్నప్పటికీ నాకు ఒక్కసారి కూడా వారు ఐ లవ్ యూ చెప్పలేదు. కానీ, జోజు జార్జ్ మాత్రం రోజూ ఐ లవ్ యూ చెప్పేవారు'' అని కమల్‌హాసన్ సరదాగా పేర్కొన్నారు. కమల్‌హాసన్ హీరోగా ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, జోజు జార్జ్, అభిరామి ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. మద్రాస్ టాకీస్, రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ బ్యానర్స్‌పై కమల్ హాసన్, మణిరత్నం, ఆర్. మహేంద్రన్, శివ అనంత్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 5న విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ మూవీస్ రిలీజ్ చేస్తోంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. శుక్రవారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మూవీ నుంచి 'జింగుచ్చా...' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. ఈ పాటకి కమల్‌హాసన్ సాహిత్యం అందించారు. ఈ సందర్భంగా **కమల్‌హాసన్ మాట్లాడుతూ–** ''నాయగన్' తర్వాత మళ్లీ మణిరత్నంగారి దర్శకత్వంలో నటించడానికి ప్రేక్షకులే కారణం. ఆయనకు, నాకు మధ్య ఇప్పటికీ ఏమీ మారలేదు. 'థగ్ లైఫ్' కచ్చితంగా విజయం సాధిస్తుంది'' అని పేర్కొన్నారు. **మణిరత్నం మాట్లాడుతూ–** ''కమల్‌హాసన్ సినిమా లవర్. డబ్బింగ్ జరుగుతుంటే నా ఆఫీస్‌కు వచ్చిన కమల్‌హాసన్ అమెరికాలో జరుగుతున్న సౌండ్ మిక్సింగ్ గురించి చెప్పారు. ఆయన దర్శకుడికి 50 శాతం భారాన్ని తగ్గిస్తారు'' అన్నారు. **త్రిష మాట్లాడుతూ–** ''మణిరత్నంగారి దర్శకత్వంలో నేను నటించిన మూడవ చిత్రం 'థగ్ లైఫ్'. అదేవిధంగా కమల్ హాసన్‌గారు, శింబుతోనూ నటించిన మూడో చిత్రం ఇది కావడం సంతోషంగా ఉంది'' అని చెప్పారు. ''కమల్‌హాసన్‌గారి నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను'' అని శింబు తెలిపారు. ఈ వేడుకలో నటీనటులు అభిరామి, జోజు జార్జ్, అశోక్ సెల్వన్, కెమెరామేన్ రవి కె.చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

– 'సాక్షి' తమిళ సినిమా, చెన్నై



● తమ్మిరాజు, సునీల్ బలుసు, కల్యాణ్‌రామ్, శ్రీకాంత్, అశోక్ వర్ధన్, ప్రదీప్ చిలుకూరి

మా అబ్బాయి మాటలతో షాక్ అయ్యా

- కల్యాణ్ రామ్

''**అర్జున్ సన్నాఫ్ వైజయంతి**' సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు, మా నందమూరి అభిమానులకు ధన్యవాదాలు. మా చిత్రానికి ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది'' అని హీరో కల్యాణ్ రామ్ చెప్పారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా విజయశాంతి, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. అదే రోజు సాయంత్రం నిర్వహించిన సక్సెస్ ప్రెస్‌మీట్‌లో **కల్యాణ్ రామ్ మాట్లాడుతూ–**''మా అబ్బాయి ఈ సినిమా చూసి, 'ఇలాంటి సీక్వెన్స్ ఇండియన్ స్క్రీన్ మీద చూడలేదు... చాలా గర్వంగా ఉంది నాన్న' అని చెప్పాడు. ఆ రియాక్షన్‌కి నేను షాక్‌కి గురయ్యాను''అన్నారు. **నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ–**''ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందనే నమ్మకంతోనే మొదలుపెట్టాం. మా నమ్మకం నిజమైంది'' అని చెప్పారు. **ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ–** ''ఈ మూవీకి ఆడియన్స్ నుంచి వస్తున్న రియాక్షన్ చూస్తుంటే గూజ్ బంప్స్ వస్తున్నాయి'' అన్నారు. **సునీల్ బలుసు మాట్లాడుతూ–** ''చాలా కాలం తర్వాత థియేటర్స్ అన్నీ మళ్లీ మా సినిమాతో ఫుల్ అవుతున్నాయి అని డిస్ట్రిబ్యూటర్స్ నుంచి కాల్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. సాయంత్రం నుంచే అన్ని చోట్ల షోలు యాడ్ అవుతున్నాయి'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్ వర్ధన్ ముప్పా, ఎడిటర్ తమ్మిరాజు పాల్గొన్నారు.

మేలో శుభం

హీరోయిన్ సమంత నిర్మించిన తొలి చిత్రం 'శుభం' విడుదల తేదీ ఖరారైంది. మే 9న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. హర్షిత్ రెడ్డి, సి. మల్గిరెడ్డి, శ్రియ కొంతం, చరణ్ పెరి, షాలిని కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రావణి నటించారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత నిర్మించారు. ఈ మూవీని మే 9న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ''వినోదాన్ని అందించే చిత్రాలను రూపొందించడమే నా లక్ష్యం. 'శుభం' ఆ కోవలోకి వస్తుంది. ఈ చిత్రం కోసం నా టీమ్ చాలా కష్టపడింది. ఈ కథను అందరితో పంచుకోవడానికి మేం సంతోషిస్తున్నాం''అన్నారు సమంత.



● 'శుభం' సినిమా పోస్టర్

ఓటీటీ – ఇది చూడొచ్చు

చరిత్రలో చెరిగిపోని వీరుడు చావా

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం చావా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సినిమా అనేది మన జీవిత ప్రతిబింబం. మన జీవితంలో ఎన్నో రకాల భావావేశాలు, వాటికి కారణమైన కథనాలు ఎన్ని ఉంటాయో వాటన్నిటినీ మళ్లీ నాటకీయంగా రూపకల్పన చేసి, నటీనటులను అవే కథనాలలో నటింపజేసి మన జీవితాన్ని మనకే అద్దంలో చూపించే మహా ప్రయత్నమే సినిమా. చిన్నప్పుడు బామ్మ ఒళ్లో చందమామను చూస్తూ చెప్పే కథలు చక్కగా ఎందుకు వింటామో తెలుసా... ఎక్కువగా చరిత్రలోని కథనాలే ఆవిడ మనకి చెప్పారు కాబట్టి. మన చరిత్రలో మన పూర్వీకుల వీరత్వం ఉంది. ఆ వీరత్వం మాటున బోలెడంత పోరాటం ఉంది. ఆ పోరాటం వెనక దాగి ఉన్న పట్టుదలతో కూడిన త్యాగం ఉంది. ఆ త్యాగంలో కనబడని బాధ, కనిపించే ఆనందంలాంటివి ఎన్నో ఉన్నాయి. అటువంటి పోరాటాలను అడపా దడపా నేటి దర్శకులు సినిమాల రూపంలో మన ముందుకు తీసుకువస్తున్నారు. ఆ కోవకు చెందినదే 'చావా' చిత్రం. ఛత్రపతి శివాజీ పేరు చాలా మందికి తెలుసు. కానీ శివాజీ మహారాజ్ కొడుకు శంభాజీ గురించి అందరికీ తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది. సినిమా ఆరంభంలోనే నాటి మొఘలు సామ్రాజ్యానికి చెందిన ఔరంగజేబుకు ఓ వార్త అందుతుంది. భారతదేశం మూలమూలలా కబళించిన మొఘలులు మరాఠాల ప్రాంతంలో మాత్రం అడుగు కూడా పెట్టలేకపోతారు. దానికి కారణం ఛత్రపతి శివాజీ. ఆయన ఇక లేరన్న వార్త ఔరంగజేబుకు అమృతంలా అందుతుంది. వార్త విన్న ఆనందం ఆస్వాదించేలోపే శివాజీ కొడుకు శంభాలా గురించి కూడా ఔరంగజేబుకు తెలుస్తుంది. దాంతో ఔరంగజేబు తన కిరీటాన్ని తీసేసి, శంభాలాను చంపిన తర్వాతే తాను మళ్లీ కిరీటాన్ని పెట్టుకుంటానని ప్రతిన బూనుతాడు. ఆ తర్వాత శంభాలాని ఔరంగజేబు కుట్రతో ఎంత దారుణంగా చంపుతాడనేదే ఈ సినిమా. లక్ష్మణ్ ఉటేకర్ ఈ సినిమాకి దర్శకుడు. ప్రముఖ వర్ధమాన నటుడు విక్కీ కౌశల్ శంభాలా పాత్రలో ఒదిగిపోయారు. ఏసుబాయి పాత్రలో రష్మికా మందన్నా కూడా అద్భుతంగా ఒదిగిపోయారు. అలాగే ఔరంగజేబు పాత్రలో అక్షయ్ ఖన్నా జీవించారు. ఇక సినిమా పరంగా ప్రతి క్షణం ప్రేక్షకుడిని ఉద్వేగపరుస్తూ చివర్లో కన్నీటితో సాగనంపుతారు దర్శకుడు. అయితే ఇది కథాపరంగా మాత్రమే సుమా. గడిచిన పదేళ్లలో 'బాహుబలి'తో ప్రపంచ ఖ్యాతిని మూటగట్టుకున్న మన టాలీవుడ్ గురించే ప్రేక్షకులు మాట్లాడుకుంటున్న ఈ తరుణంలో 'చావా' సినిమా మాత్రం దాదాపుగా అడుగంటిన బాలీవుడ్ ఖ్యాతిని ఒక్కసారిగా ఉలిక్కిపడుతూ లేపిందనే చెప్పాలి. ఈ సినిమా విడుదలకు ముందు తర్వాత కూడా ఎన్నో సంచలనాలకు దారి తీసిందన్న విషయం మనకు తెలుసు. 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమ్ అవుతున్న ఈ 'చావా' ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా, కాదు కాదు చూసి తెలుసుకోవాల్సిన చరిత్ర. తప్పనిసరిగా చూడాల్సిన చిత్రం.



– హరికృష్ణ ఇంటూరు